క్లుప్తంగా

నేడు పట్టణంలో గుడ్ మార్నింగ్ నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే నాయకులు, కార్యకర్తలు అందరూ స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు హాజరు కావాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.13.05 లక్షలు విలువైన నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఐ సి.హెచ్.మణికృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23 తేదీన మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల నామాల మీనా ఇంటిలో చోరీ జరిగింది. ఇంట్లోని 60 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు, ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీనిపై నామాల మీనా ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన గాలం రాజేష్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రాజేష్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకున్నట్లు పోలీసులకు నిందితుడు తెలిపాడు. దీంతో నిందితుడి వద్ద నున్న రూ.13.05 లక్షలు నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్‌ఐ మణికృష్ణ తెలిపారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుసేన్

రెంటచింతల: కార్మికులు సంఘంగా ఏర్పడితేనే హక్కులు సాధించుకోవచ్చని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడి హక్కుల సాధనకు సంఘం ఎంతగానో తోడ్పడుతుందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం వద్ద యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో అఖండ పల్నాడు రాజ్యాన్ని పరిపాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని భక్తులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం హాజరైన భక్తులకు పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, గండికోట వెంకటేశ్వర్లు, విగ్రహ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు మేకల రాంబాబు, యాదవ సేవా సమితి అధ్యక్షులు ఆవుల జనార్దన్, కార్యవర్గ సభ్యులు టి. సురేష్, ఇసరాజు అప్పారావు, కొరకుటి శ్రీనివాసరావు, సంక్రాంతి వెంకటేశ్వర్లు, చింతల అజయ్‌కుమార్, వడ్లంపుడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.





ఇదా స్వచ్ఛ ఆంధ్ర !?



వినుకొండ పట్టణంలోని ఎస్‌సీ కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రధాన గేటుకు ఇరువైపులా ప్రహరీ ఆనుకొని పారిశుద్ధ్యం లోపించి దారుణంగా తయారైంది. పాఠశాల ప్రహరీ ఎడమ వైపు మురుగునీరు నిలబడి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మరోవైపు చెత్తాచెదారంతో నిండి డంపింగ్ యార్డును తలపిస్తోంది. పాఠశాలలో 400 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో బాత్ రూమ్‌లో నుంచి వచ్చే మురుగు కూడా దీనికి తోడు కావడంతో మురు నిలబడి ఇబ్బందికరంగా మారింది. దుర్గంధం వెదజల్లుతూ అటుపోయే వాళ్ల కూడా ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయి. ఇంత జరుగుతున్నా కనీసం అటు పాఠశాల సిబ్బంది గాని, ఇటు మున్సిపల్ సిబ్బంది గాని పట్టించుకోవడంతో వర్షాకాలంలో మరీ నీరు ఎక్కువ తటాకాన్ని తలపిస్తోంది. పాఠశాల ప్రహరీపై స్వచ్ఛ ఆంధ్రపేరుతో అందమైన బొమ్మలు ఉండడం, జాతిపిత గాంధీ తాత చెత్తను శుభ్రం చేస్తున్నట్టు ఫొటోలు కూడా ఉన్నాయి. ఆ గోడ ఆనుకొనే మురుగునీరు నిలవడం విశేషం. ఇప్పటికైనా పాఠశాల సిబ్బంది, మున్సిపల్ అధికారులు సమన్వయంతో మురుగు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

–వినుకొండ

శావల్యాపురంలో ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి



శావల్యాపురం: మండలంలోని పొట్లూరు గ్రామంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల బీజేపీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. భారతదేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈకార్యక్రమంలో బీజేపీ నేతలు పాటిబండ్ల ఆంజనేయప్రసాదు, తమ్మిశెట్టి సిద్ధయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొగాకు పంట సాగు చేయవద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి యం.జగ్గారావు
- రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించాలి
- వరి నారుమడులు సాగులో వినుకొండ ఆలస్యం



శావల్యాపురంలో వరి నారుమడు పరిశీలించుతున్న వ్యవసాయ అధికారుల

శావల్యాపురం: రైతులు పొగాకు సాగు చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి యం.జగ్గారావు అన్నారు.శనివారం మండలంలోని కృష్ణాపురం,శావల్యాపురం గ్రామాల్లోని మాగాణి భూములు వరి నారుమడులను పరిశీలించి రైతులు అభిప్రాయ సేకరించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి యం.జగ్గారావు మాట్లాడుతూ జిల్లాలో 38 వేల హెక్టార్లు మాగాణి భూమి ఉండగా జిల్లాలో 1850 హెక్టార్లు వరి నారుమడులు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1650 హెక్టార్లు 5 సెంట్లు మొర వరినారుమడులను రైతులు సాగు చేశారన్నారు. రైతులు లాభకరమైన పంటలు సాగుకు అధికంగా ఆసక్తి చూపాలన్నారు. పొగాకు పంట సాగు చేయటం వల్ల రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని ప్రవేటు కంపెనీలు మోసపూరిత మాటలు నమ్మి పొగాకు పంట సాగు చేయరాదన్నారు. గత ఏడాదిలో పొగాకు పంట సాగు చేసిన రైతులు కొనుగోలు చేసే వారు లేకపోవటం చేత రైతులు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. రైతులు ఆరుతడి పంటల సాగు చేసుకోవచ్చునన్నారు. శావల్యాపురం మండలంలో ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు చేస్తున్నట్లు రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తెచ్చారు. రైతులు అవసరానికి మించి రసాయనిక ఎరువులు వినియోగించరాదన్నారు. జిల్లాలో వినుకొండ నియోజకవర్గంలో మాత్రమే వరి పంట సాగు చివరిదశలో ఉందన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించాలన్నారు. ముఖ్యంగా ఎరువులు పురుగు మందులు దుకాణాదారులు రైతులకు అమ్మినవన్నీ ఆన్‌లైన్ నమోదు చేయాలని తద్వారా ఎరువుల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలకు అవకాశాలకు ఉంటాయన్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ) బ్యాంకు ఖాతాలు పెండింగ్ ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌లో ఈకైవైసీ నమోదు కాని రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆయనతో పాటు వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, రైతుసేవా కేంద్రం సహాయకురాలు వర్ల వెంకాయమ్మ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామకమిటీలు ఏర్పాటు



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో నూతన గ్రామపార్టీ అధ్యక్షులుగా పురేటి బ్రహ్మం ఏకగ్రీవంగా శనివారం ఏన్నుకున్నారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారధ్యంలో మండల గ్రామ స్థాయి నాయకులు సహకారంతో నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య సూత్రం యోగా



నరసరావుపేట ఈస్ట్: మానసిక, శారీరకమైన సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఏకైక మార్గమని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) ప్రధాన ఆచార్యులు ఆతుకూరి వేంకటేశ్వర యోగి తెలిపారు. యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన 188వ ఉచిత యోగ శిక్షణా శిబిరం ఆనంద మహోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులను ఉద్దేశించి శనివారం టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అభ్యాసకులు ప్రతిరోజు నిర్మలమైన, ప్రశాంతమైన వాతావరణంలో కొద్దిపాటి వెలుతురులో యోగ సాధన చేయాలని సూచించారు. శిబిర నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధన్ గురూజీ మాట్లాడుతూ, అభ్యాసకులు గురుదక్షిణగా ప్రతిరోజు కనీసం 30 నిమిషాల పాటు యోగ సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సహాయ బోధకులు అద్దగిరి రమేష్, లక్ష్మీ, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



కళాకారులను సత్కరిస్తున్న గుమ్మడి కళాపీఠం సభ్యులు

వినుకొండ: అంతరించిపోతున్న కళలను, ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటున్న కళాకారులను గుమ్మడి కళాపీఠం ఆదుకుంటూ కళలను బతికిస్తుందని అఖిల భారత ఎన్‌టీఆర్ అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పన ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రవీంద్ర స్కూల్ కరస్పాండెంట్ ఎస్కే సుభాని అధ్యక్షత వహించగా గుమ్మడి కళాపీఠం వ్యవస్థాధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని తెలిపారు. నాదస్వర కచేరి, వివిధ సినిమాల్లో అభ్యుదయ పాటలతో సంగీత విభావరి నిర్వహించి కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం జాతీయ ఉపాధ్యక్షులు మట్టా ప్రసాద్, పాడుతా తీయగా సింగర్ విజయరాజు, లావణ్య, ఎస్కే సిద్ధయ్య, ఆదిత్య, భావన, రామ్మోహనరావు, బత్తుల మురళి, కోట వెంకట సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, రామయ్య, కళాకారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

నరసరావుపేట: మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావొస్తున్నా మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కారం కోసం ఈ నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు అన్ని మున్సిపల్ కేంద్రాలు, పట్టణాలలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు అమలు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు రాష్ట్రం మొత్తం ఒకే వేతన విధానం అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో నియమించిన బదిలీ కార్మికులకు రూ.9 వేలు నుంచి రూ.12 వేలు వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, వారికి కూడా రూ.21 వేలు వేతనాలు చెల్లించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్ల నుంచి నెలకొన్న సరెండర్ సెలవులకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యవసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాల నాయకులతో సంప్రదింపులు నిర్వహించి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో కార్మికులను ఏకం చేసి రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు వెంకయ్య, వీరకుమార్, షేక్ చిన్న అల్లాబక్షు, సోమశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

19న చిలకలూరిపేటలో వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేటటౌన్(యడ్లపాడు): విద్యుత్ వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారానికి న్యాయ సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు టౌన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు తెలిపారు. ఈ నెల 19వ తేదీ మంగళవారం చిలకలూరిపేటలోని సింగు మినీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే ఈ సదస్సులో వివిధ ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ పరమైన తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదస్సులో డోకిపర్రు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చిలకలూరిపేట టౌన్–1, టౌన్–2, రూరల్ మండలం, గణపవరం, యడ్లపాడు ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సుదీర్ఘంగా ఉన్న తమ సమస్యల్ని పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సదస్సులో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విజయవాడకు చెందిన అధ్యక్షులు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎస్.విక్టర్ ఇమ్మానియేలు, సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు ఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. కావున విద్యుత్ అంతరాయాలు, మీటర్ సమస్యలు, హెచ్చుతగ్గులు, బిల్లింగ్ సమస్యలు, సరఫరాలో లోపాలు వంటి ఏవైనా పరిష్కారం కాని సమస్యలు ఉన్న వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. ఈ సదస్సులో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై ఏడుకొండలు కోరారు.

జయకృష్ణా ముకుందామురారే!

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు
- ఉత్సవమూర్తుల ఊరేగింపులు
- పలు రకాల ప్రసాదాలు, అన్నప్రసాద వితరణలు
- ఉట్టిమహోత్సవాల నిర్వహణ



సాతులూరులో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి



టెలిగ్రాఫ్ బజార్‌లోని చలువ పందిరిలో కొలువుదీరిన శ్రీకృష్ణపరమాత్ముడు



కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొన్న చిన్నారులు



వినుకొండలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



నూజెండ్లలో ప్రత్యేక అలంకరణలో చిన్నారులు

చిలకలూరిపేటటౌన్ (యడ్లపాడు): కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేట పట్టణంలోని పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కృష్ణమందిరాలు, వేణుగోపాలస్వామి ఆలయాలు, రామమందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని సీతరామమందిరం, చౌత్రాసెంటర్‌లో గీతా మందిరం, టెలిగ్రాఫ్ వీధిలో చలువ పందిరిలో ఏర్పాటు చేసిన గోపీకృష్ణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తుల్ని ప్రధాన వీధుల్లో భజాభజంత్రీల నడుమ ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఉట్టికొట్ల మహోత్సవాలు నిర్వహించగా, చిన్నారులు, యువకులు, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నాదెండ్ల: కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గణపవరంలోని శ్రీ కోదండరామాలయంలో జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన మహిళా భక్తులు లలితాపారాయణం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో రాత్రి ఆలయం వద్ద ఉట్టికొట్టే పోటీలు సందడిగా జరిగాయి.

రొంపిచర్ల: మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండల ప్రజలు శనివారం నిర్వహించుకున్నారు. చిన్న పిల్లలు గోపాలకృష్ణ, గోపికా వేషధారణలో కనిపించారు. కొనకంచివారిపాలెం, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట తదితర గ్రామాల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వినుకొండ : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం అయినవోలు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత 15 సంవత్సరాల నుంచి కాయకాకుల శివకృష్ణ యాదవ్, కాటం శ్రీనివాస రావు, ఆలా శ్యాంప్రసాద్ యాదవ్, బొమ్మినేని బాల వెంకటేశ్వర్ యాదవ్, ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

నరసరావుపేట ఈస్ట్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం కే–రిడ్జి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు రాధా కృష్ణులు, గోపికలు, గోపాలురు, విచిత్ర వేషధారణలతో అలరించారు. ఉట్లోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని సందడి చేసారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ పాల్గొన్నారు.

నూజెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం కన్నుల పండుగగా సందడి సంతోషాలతో ఘనంగా శనివారం నిర్వహించారు. నూజెండ్ల గ్రామంలో తల్లిదండ్రులు తమ చిన్నారులను కన్నయ్య గోపికల వేషాదారణతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో యాదవరాజులు శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుడు చిత్రపటానికి పూలదండలు వేసి నామస్మరంతోత జన్మదిన కేకు కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. గొల్లభామ, శ్రీకృష్ణుడు వేషాధారుణతో ప్రత్యేకంగా అలరించారు.

వినుకొండ: పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ క్యాంపస్ నందు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొని శ్రీకృష్ణాష్టమి విశిష్ఠతను వివరించారు. విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు.

జీవీ ఐఐటీ పాఠశాలలో ..

చిలకలూరిపేటటౌన్: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక జీవీ ఐఐటీ పాఠశాలలో కృష్ణుడి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ఛైర్మన్ పారేపల్లి ఉదయ్‌కుమార్, భగవద్గీత ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యక్తిత్వ వికాస గ్రంథమని కొనియాడారు.



చౌత్రసెంటర్లోని గీతామందిరంలో హారతి ఇస్తున్న అర్చకులు



మెయిన్ బజార్‌లో ఉట్టిమహోత్సవంలో పాల్గొన్న మహిళలు

పాస్టర్ క్రిష్టర్‌కు అభినందన సభ



పాస్టర్ నందమూరి క్రిష్టర్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ మందిరం ఆధ్యాత్మిక ఆనందోత్సవానికి వేదికైంది. ఆల్‌ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్‌కు నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన నందమూరి క్రిష్టర్‌కు అభినందన సభ ఘనంగా జరిగింది. క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ మందిరంలో శనివారం చర్చి పాస్టర్ లూకాపాల్, ఆయన కుమారుడు రత్నకుమార్ నిర్వహించారు. పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న వెంకటరెడ్డి నగర్‌లో జరిగిన ఈ సభలో ముఖ్య అతిథి క్రిష్టర్ ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, అదే సమయంలో పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా కూడా సేవలందించే అవకాశం దేవుని దయ వల్లనే లభించిందన్నారు. దేవుడు అందించిన ఈ బాధ్యతను సేవకులు, సంఘాల సంక్షేమం కోసం వినియోగిస్తానని తెలిపారు. ముందుగా చర్చిలో దైవారాధన చేశారు. క్రిష్టర్‌కు మరిన్ని పదవులు అధిరోహించాలని..అనేక గొప్ప సత్‌కార్యాలను చేసి అందరినోటా కీర్తింపబడాలని పాస్టర్లు ప్రార్థనలు చేశారు. పాస్టర్ క్రిష్టర్‌కు దైవ సేవకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట సీనియర్ దైవసేవకులు సంసోను, అబ్రహాము, కేజే రాజు, మరియదాసు, సూరిబాబు, చిగురు మందిరం పాస్టర్ మణిమాల, పాస్టర్లు ధనరాజ్, అఖిల్, జోసఫ్, అభి అక్కా, వివిధ నియోజకవర్గాలు, మండలాల ఫెలోషిప్ కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఈ సభలో పాల్గొన్నారు.

•మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

మాచర్ల: పూజిత మహిళ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నర్రిశెట్టి కళ్యాణ మండపంలో మహిళలకు కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్‌లను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.